# 1

# చరిత్ర పూర్వ యుగము

## ( Prehistoric Age )

తొలిమానవుడు జన్మించి ఇప్పటికి ఒక మిలియన్ సంవత్సరా లవుతుంది. భూగర్భశాస్త్ర కాలమానంలో కడపటిదైన ప్లైస్టొసీన్ (pleistocene) యుగంలో ఇదిజరిగింది (చిత్ర పటము 1). అప్పటికే భూమికి ఒక నైసర్గిక స్వరూపం ఏర్పడ్డది. నేల, సముద్రాలు, ఖండాలు, అత్యున్నత పర్వతాలు, మహానదులు వివిధ శీతోష్ణస్థితులు ఏర్పడ్డాయి. ఏవో కొన్ని భౌగోళిక పరిణామాలను మినహాయిస్తే ప్రపంచ భౌతిక స్వరూపము ఈనాటికీ దాదాపు అదేవిధంగాఉంది. ఇట్లా మానవోదయ పూర్వయుగంలో అతడు నాగరకుడు కావడా నికి అవసరమైన రంగస్థలము అమరిఉంది. ఇంతేకాక, జీవరాసుల ఉత్పత్తి, వివిధ దశలలో మానవ శరీరపరిణామమూ, ఈ యుగం లోనే జరిగినాయి.


జీవపరిణామము నెమ్మదిగా జరిగింది. ఒకదాని తరువాత ఒకటిగా చాలా మార్పులు వచ్చినాయి. జీవజంతువుల పరిణామ క్రమాన్ని సాధారణంగా ఒక మహావృక్షంతో పోలుస్తూ ఉంటారు. వృక్షకాండము బలంగా ఎదుగుతూ, ఎదిగినకొద్దీ నాలుగువైపులకూ శాఖోపశాఖలుగా చీలిపోతూ, ఉంటుంది. దీనిచిటారుకొమ్మ మానవ వర్గాన్ని సూచిస్తుంది. ఈ వర్గంలో కోతులు చింపాంజీల తరవాత మానవులు చేరుతారు. మానవులకూ చింపాంజీలకూ చాలా పోలి కలు ఉన్నప్పటికీ, పరిణామ వృక్షంలో మానవశాఖ, చింపాంజీ శాఖా, ఒకటికాదు. శాఖాభేదంతోబాటు ఉభయులమధ్య ఉన్న సంబంధము దూరమైంది (చిత్ర పటము 2). తొలిమానవుల కపా లాలూ శల్యాలూ కొన్ని యాదృచ్ఛికంగా బయటపడ్డాయి. తొలి

| | భూగర్భ శాస్త్ర సమయము | జీవితపు నమూనా స్వరూపాలు | సంస్కృతి సమయము |
|---|---|---|---|
| మూడు బిలియన్ల సంవత్సరాల పూర్వము | ప్రికాంబ్రియన్ | ఒకే గుల్ల కలిగిన జీవులు మొదటి వెన్నెముక లేని జంతువులు: పురుగులు, ఆల్గే. | |
| 510 మిలియన్ల సంవత్సరాల పూర్వము | లుపజంతు (యుగము) (పాలియోజోయిక్) | మొలస్కులు, స్పాంజులు, పురుగులు, మొదటి వెన్నెముక జంతువులు, పగడాలు, శైవలాలు, లంగ్‌చేపలు, క్రస్టేషియనులు, ప్రాచీన ఉభయ జీవులు, పెద్ద ఉభయ జీవులు, ఫెరన్లు. | |
| 180 మిలియన్ల సంవత్సరాల పూర్వము | మధ్య జీవ యుగము (మెసోజోయిక్) | రక్కసి సరీసృపాలు, విభిన్న సరీసృపాలు, పక్షులు, మార్సుపియల్స్, ఎముక చేపలు, చెట్లు. | |
| 90 మిలియన్ల సంవత్సరాల పూర్వము | సెనజోయిక్ యుగము | మూడో: ప్రాచీన స్తనజంతువులు. మొదటి ప్రైమేట్లు ప్రాచీన కోతులు, కోతుల పూర్వీకులు, పెద్ద కోతుల పూర్వీకులు, మానవునికి పూర్వీకులు, నవీన స్తన జంతువులు. ప్రాచీన మానవజాతి, ఇతర ప్రైమేట్లు. | |
| 1 మిలియన్ సంవత్సరాల పూర్వము | | నాలుగో ప్లైస్టోసీన్: ఈనాటి జంతువులు, మానవ జాతులు. | దిగువ పాతరాతియుగపు<br>ఎగువ పాతరాతియుగపు |
| 7000 సంవత్సరాల పూర్వము | | నాలుగో నవీన | కొత్త రాతియుగపు<br>నాగరక మానవుడు. |

చిత్రపటము 1. మానవాభ్యుదయము

4406-






చిత్రపటము 2. మానవపరిణామము

మానవులు ఉపయోగించిన పనిముట్లమూలంగా వారి శరీరశల్యాల మూలంగా, వారిచరిత్రను తెలుసుకోటానికి వీలు పడుతున్నది.

మానవుడు మొట్టమొదట పుట్టింది ఆఫ్రికాఖండంలో అని నేడు శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. క్రమేణా మానవులు ఆసియా, యూరప్, అమెరికా ఖండాలను చేరుకొన్నారు. చరిత్ర

ప్రారంభకాలంలో ఆరు ముఖ్య మానవజాతులు ఉండేవి. (1) నీగ్రాయిడ్ (Negroid) (2) కాకసాయిడ్ (Caucasoid) (3) మంగోలాయిడ్ (Mongoloid) (4) బుష్‌మెన్ (Bushmen) (5) ఆస్ట్రలాయిడ్ (Australoid) (6) పాలినీసియన్ (Polynesian) లేదా పసిఫిక్ (Pacific). కొన్ని వేల సంవత్సరాలవరకూ మానవ జీవన విధానానికి, మృగాల జీవనవిధానానికి భేదముండేదికాదు. పశుపాలన వ్యవసాయపద్ధతులను నేర్చుకొన్న తరవాత మానవజీవనవిధానము మారి, అతడు నాగరకుడు కావడం ప్రారంభమైంది. ఈ పరిణామము ఇప్పటికి పదివేల సంవత్సరాలకులోపుగానే జరిగింది. ఇంతటితో చరిత్ర పూర్వయుగము ముగిసి చారిత్రకయుగము ప్రారంభమయింది. మానవ నాగరకతా పురోగమనము ఆరంభమయింది.

## శిలాయుగము (Stone Age)

(సుమారు క్రీ. పూ. 50,000 నుంచి క్రీ. పూ. 5000 వరకు)

క్రీ. పూ. దాదాపు 50,000 నుంచి క్రీ. పూ. 5000 సంవత్సరాల వరకు ప్రాచీన మానవుడు ఆత్మరక్షణకు, ఆహార సముపార్జనకు రాతి ఆయుధాలను రాతి పనిముట్లనే వాడడంవల్ల ఈ కాలానికి శిలాయుగము (Stone Age) అనే పేరు వచ్చింది. ఈ శిలాయుగాన్ని ప్రాచీన శిలాయుగ (Old Stone Age or Palaeolithic Age) మని, నవీన శిలాయుగ (New Stone Age or Neolithic Age) మని, రెండుగా విభజించవచ్చు. ప్రాచీన శిలాయుగాన్ని మళ్లీ పూర్వప్రాచీన శిలాయుగ (Lower Palaeolithic Age) మని, ఉత్తర ప్రాచీన శిలాయుగ (Upper Palaeolithic Age) మని, పునర్విభజించవచ్చు.

## ప్రాచీన శిలాయుగము (Palaeolithic Age)

(సుమారు క్రీ. పూ. 50,000 నుంచి క్రీ. పూ. 10,000 వరకు)

### పూర్వప్రాచీన శిలాయుగము (Lower Palaeolithic Age)

(సుమారు క్రీ. పూ. 50,000 నుంచి క్రీ. పూ. 25,000 వరకు)

పూర్వప్రాచీన యుగంలో మానవాకృతి పరిణామాలు పొందుతూనేఉంది. కానీ మానవుడు ఈ యుగంలోనే తక్కువ జీవ

జాలంలో ప్రత్యేకస్థానాన్ని ఆక్రమించినాడు. పూర్వప్రాచీన శిలా యుగంలో కింది నాలుగు తెగలకు చెందిన మానవులు ఉండేవారని మనకు దొరికిన ఆనాటి మానవుని ఎముకలద్వారా తెలుస్తున్నది :

(1) పిథికాన్థ్రొపస్ ఇరెక్టస్ (**Pithecanthropus erectus**) : క్రీ. శ. 8191 లోఈ తెగ మానవుని ఎముకలు జావాలో దొరికి నందువల్లఇతణ్ని 'జావా మనిషి' అనికూడా అంటారు.

(2) సినాన్థ్రొపస్ (**Sinanthropus**) : ఈ తెగకు సంబంధించిన మనిషి ఎముకలు చైనాలోని పెకింగ్ ప్రాంతంలో క్రీ. శ. 1926, క్రీ. శ. 1930 మధ్యలో లభించడంవల్ల అతనికి పెకింగ్ మనిషి (**Peking Man**) అనేమరొక పేరు వచ్చింది.

(3) ఫోంత్‌షావాద్ (**Fontechevade**) మానవుడు : క్రీ. శ. 1947లో ఇతని అస్థిపంజరం ఫ్రాన్సులోని షారంతోలోని ఒకగుహాలో దొరికింది.

(4) హోమొ నియాన్డర్థలెన్సిస్ (**Homo Neanderthalensis**): ఈ తెగ మానవుని ఎముకలు జర్మనీలోని నియాన్‌డర్ లోయలో క్రీ. శ. 1856లో లభించినాయి.

పూర్వ ప్రాచీన శిలాయుగంలో మానవులు తమభావాలను ఇతరులకు మాటలద్వారా తెలియజేయడం, సంఘజీవిగా బ్రతకడం, అలవరచుకొన్నారు. నిప్పును రాజేయడం నేర్చుకొన్నారు. మృత దేహాలను భూస్థాపితం చేసేవారు. ప్రాచీన మానవుని జీవనము, అభివృద్ధి, అతడు వాడిన రాతిపనిముట్ల మూలంగా మనము తెలు సుకో గలుగుతున్నాము. ప్రాచీన మానవులు మొదట్లో వాడిన రాతిపనిముట్లు సామాన్యమైనవి. ఒక్క పనిముట్టు అనేకమైన పను లకు ఉపయోగపడేది. దేనినయినా కోయాలన్నా, దేనిలోనుంచ యినా గుజ్జు తీయాలన్నా దేనిలోకయినా గుచ్చాలన్నా, దేనినైనా ముక్కలు చేయాలన్నా, దేనిపెచ్చునయినా తీయాలన్నా ఈ ఒక్క రాతిపనిముట్టే అన్ని పనులకూ ఉపయోగపడేది. ఆది మానవులు


తయారు చేసుకొన్న పనిముట్లు ముఖ్యంగా మూడు రకాలవి. లోపలి గుజ్జును తీసే కోరాలు (Core), పై పెచ్చు తీసే చాకులు (Blades), ముక్కలుగా నరకడానికి పనికివచ్చే కత్తులు (Knives). ఈ రాతిపనిముట్ల పరిశ్రమ అనేకవేల సంవత్సరాలు వర్ధిల్లింది (చిత్ర పటము 3).

## ఉత్తర ప్రాచీన శిలాయుగము (Upper Palaeolithic Age)
(సుమారు క్రీ. పూ. 25,000 నుంచి క్రీ. పూ. 10,000 వరకు)


ఈ కాలపు మానవుని ఎముకలు ఫ్రాన్సులోని క్రోమాగ్నన్ (Cromagnon) గుహలో దొరకడంవల్ల ఇతణ్ణి క్రోమాగ్నన్ మనిషి అంటారు. ఇతడు నియన్‌డర్‌థల్ మానవునికన్నా తెలివైనవాడు. ఇతడు పూర్వులు తయారుచేసిన ఆయుధాలకన్నా, పరికరాలకన్నా, శ్రేష్ఠమైనవాటిని తయారుచేసినాడు. వీటిని తయారు చేయడానికి రాతినేగాక ఎముకలు, ఆడివిదున్న కొమ్ములు, దంతాలు, ఉపయోగించినాడు. మృగాల చర్మాన్ని కప్పుకొనేవాడు. ఆభరణాలను ధరించడం, ఆహారాన్ని వండడం నేర్చుకొన్నాడు. సామాన్యంగా గుహల్లో నివసించినా గుడిసెలను వేసుకొనేపద్ధతి ఇతనికి తెలుసు. మృతదేహాన్ని ఖననం చేసే విషయంలో ఈ మానవుడు శ్రద్ధవహించినాడు. అదృశ్యశక్తులలో నమ్మకాన్ని పెంచుకొన్నాడు. ఇదే మతము, శిల్పము, చిత్రకళలు, పెంపొందడానికి నాంది పలికింది (చిత్ర పటము 4).

## నవీన శిలాయుగము (Neolithic Age)
(సుమారు క్రీ. పూ. 10,000 నుంచి క్రీ. పూ. 5000 వరకు)

నవీన శిలాయుగంలోనివారు రాతితోచేసిన పరికరాలను ఉపయోగించినా, అవి పూర్వయుగంవారు ఉపయోగించిన వాటికన్నా అందంగా ఉండేవి. వీరు రాతిముక్కలనుచెక్కి, అరగదీసి, నునుపుచేసి వాడుతుండేవారు. నవీన శిలాయుగంలో మానవులు పశుపాలన, వ్యవసాయము, నేర్చుకొన్నందువల్ల వీరు ఆహారసేకరణనేగాక ఆహా




చిత్రపటము 3. రాతి పనిముట్లు



చిత్రపటము 4. ఫ్రాన్స్‌దేశము. క్రోమాగ్నన్ మానవుని కళలోని సహజత్వాన్ని చూపు గుహాకుడ్య చిత్రము.

రోత్పత్తినికూడా చేపట్టినారు. పాడిపంటలవల్ల వీరి తిండి కొరత తీరింది. ఆహార పదార్థాలను నిలవచేసుకోవడం తెలిసింది. ఆహారం కోసం ప్రకృతిమీద సంపూర్ణంగా ఆధారపడడం, ఆహారపదార్థాలు కొరతపడడం, ఆహర్నిశలూ ఆహారసంపాదనకే శ్రమించేఅవసరం లేకపోవడం, మానవజాతి పెరుగుదలకూ సాంఘికాభివృద్ధికీ దారితీసినాయి. ఈ యుగంలోనే తెప్పలవంటి సముద్రయాన సాధనాలను కనిపెట్టడంతో మానవజాతి ఆసియా, ఆఫ్రికా, యూరపు ఖండాలకు విస్తరించడం జరిగింది. మానవులు బట్టలు నేయడం, నిప్పు రాజేయడం, కుండలను తయారు చేయడం, నేర్చుకొనినారు. మట్టితో కలపతో ఇళ్ళను కట్టడం నేర్చుకొన్నారు. లోహాలను ఉపయోగించడం కూడా తెలుసుకొన్నారు.

నవీన శిలాయుగంలో మానవుడు పశుపాలన వ్యవసాయ దశలను చేరడం విప్లవాత్మక విషయము. ఇందువల్ల గ్రామీణ సాంఘిక




చిత్రపటము 5. నాగరకతా పరిణామము.

జీవనాలు పెంపొందినాయి. వస్తువుల కొనుగోలు వ్యాపారానికి దారితీసింది. కుటుంబమనే ప్రభుత్వమనే సామాజిక వ్యవస్థలు రూపొందినాయి. మానవులలో ఉన్న భీతి క్రమేణా మతదృష్టిని పెంపొందించింది. చరిత్ర పూర్వయుగంలో మానవుడు నేర్చినదే గృహనిర్మాణము, వస్త్రధారణము, అలంకరణ, ఆహారపచనము, సంఘజీవనము, సంధివిగ్రహాచర్యలు, శ్రమించడం, వినోదము, మతము, కళలు. అంటే మానవ నాగరకతా సౌధాలకు చరిత్ర పూర్వయుగంలోనే పునాదులు పడ్డట్లు (చిత్రపటము 5).